# పట్టకోపాఖ్యానం



"ధబ్బు ధబ్బు హుస్ హుస్" అని చప్పుడు వినపడేటప్పటికి, పట్టాలు తప్పిన రైలేదేనా పడగ్గదిలోకి చొరబడుతోందా అని ఖంగారుగా కళ్ళు నలుపుకుని పొద్దున్నే లేచి కిటికీలోంచి చూసేసరికి ఎదురుగుండా పక్కింటి గ|| భ|| స|| మహంకాళమ్మగారు చీపురు కట్టతో చూరులోవున్న పిట్టలగూడు పడగొడుతూ ప్రళయ తాండవ భంగిమలో ప్రత్యక్షమయింది. కర్ణాకర్ణిగా వచ్చిన వార్తలనుబట్టి, రోజూ ఆవిడ మొహం కడుక్కునే ప్రయత్నంలో వసారాలో కూర్చుండటం, అదే సమయంలో ఆవిడంటే వున్న ప్రేమానురాగాల వల్లో భయంవల్లో ఆ పిట్టలు ఆవిడ నెత్తిమీద రెట్టవెయ్యడం పరి

పోటయినట్టు తెలిసింది. అంచేత ఆ పిట్టలగూడు చీపురుకట్టతో పడగొట్టి మట్టుపెట్టడాని కావిడ చేసే కట్టుదిట్టప్పని అది.

పొద్దున్నే లేవగానే కళ్ళపడ్డ దృశ్యం తాలూకు పాపపరిహారార్థం, కనుచూపు మేరలో గోడలకి సినిమాతారల కేలండర్లు తప్ప ప్రార్థనకి పనికివచ్చే బొమ్మలేమీ లేని సందర్భంలో మనస్సులోనే పదిసార్లు రామనామం, మూడుసార్లు గాయత్రి పఠించి ఒళ్ళు విరుచుకు లేచేను. ఐతేనేం పాపఫలితం వూరికే పోకుండా, తిరుపతినుంచి తిరిగొస్తున్న మా తోడల్లుడు సకుటుంబంగా యిక్కడ దిగి మా గృహం పావనం చెయ్యడానికి సంకల్పించినట్టు టెలిగ్రాం—

చుట్టాలలో యీ తోడల్లుడనేవాడో ప్రత్యేక తెగ. టూకీగా నిర్వచించాలంటే 'భార్యద్వారా సంక్రమించిన నరరూప దురదృష్టం' అనడం సబబు. వీడెలాంటి చవటైనా మర్యాదలుచేసి బ్రహ్మరథం పట్టాలి. లేకపోతే యిటు కట్టుకున్న పెళ్ళాం అటు అత్తమామలూ వురేసుకున్నంత పని చేస్తారు. కిందటిసారిక్కడికి వేంచేసినప్పుడు వీడో హితబోధ చేసేడు—క్లబ్బు, పేకాట, సినిమాలూ, సిగరెట్లూ మానెయ్యాలిట. మరి వాడిలాగే పెళ్ళాం కొంగట్టుకుని తీర్థయాత్రలు చెయ్యాలని వాడి వుద్దేశమనుకుంటా.

లేచిన వేళావిశేషమనండి, వచ్చిన దుర్వార్తవల్లననండి, మనస్సు పరిపరి విధాలపోయి చికాకుగావుంది. దానికి సాయం తలమాసింది. పైగా శలవు రోజూ. దానా దీనా క్షౌరం చేయించుకో దలుచుకుని మా నౌకర్ని పిలిచి మంగలిని తీసుకు రమ్మన్నాను. మా పక్కవీధిలో ఓ ముసలాయిన పరమ పదించినందువల్ల వాడి వాద్య సంగీత పాండిత్యానికి గిరాకి తగిలిన సందర్భంలో నాంకువతనగా క్షౌరం చేసేమంగలి లేకపోతే మాకోలనీ కంతకీ 'పూర్వసువాసినీ స్పెషలిస్ట్'గా పేరు మోసిన సుబ్బయ్యనే మంగలిని తీసుగొచ్చేడు.

'ఏరా! నువ్వు మొగాళ్ళకి కూడా చేస్తావా!' అని అడిగేను. అసలు వాడిదగ్గర ఒక్క కత్తి మాత్రమే వుంటుందని నా నమ్మకం.

'అదేటి బాబయ్యా! నాలుగోవీధిలో జడ్జిగారికికూడా నేనే చేస్తానండి' అన్నాడు, అందుకు తార్కాణంగా పొదిలోంచి కత్తెరా, దువ్వెన్నా, కత్తీ పైకితీస్తూ.

దైవంమీద భారంవేసి తల వాడిచేతిలో పెట్టి పేపరు చదువుతూ కూర్చున్నాను. పే కమిటీ రిపోర్టు చదువుతుంటే లాగుంది స్పృహతప్పింది. మళ్ళీ ఒంటిమీద స్పృహొచ్చేటప్పటికి సుబ్బయ్య పొది సర్దుకుని డబ్బుకోసం చెయ్యి జాచేడు. వాణ్ణి పంపించేసి యింట్లోకి అడుగెట్టగానే మా ఆవిడ ఎదురయ్యి పరాయి మొగాడెదురైనట్టుగా పవిట సద్దుకుని మళ్ళీ నా మొహంకేసి తేరిపారచూసి 'మీరా! ఔవ్వ! ఔవ్వ! అదేమిటండీ అలా చేయించుకున్నారూ! రేపు మావాళ్ళొస్తున్నారుకూడాను' అంది కంట తడిపెడుతూ. అనుమానంగా నెత్తిమీద చెయ్యేట్టి చూసుకున్నాను. టూత్ బ్రష్‌మీద చెయ్యేట్టినట్టుంది. అద్దంలో చూసుకుంటే అసలా తల నాదేనా అని అనుమానం వేసింది. చుట్టుకొలతా వ్రుతుతల వైశాల్యం పూర్తిగా మారిపోయాంఖ. వెంట్రుకల సగటు పొడుగు అర్ధ సెంటీ మీటరు.

'రాస్కెల్! జడ్జిగారికి కూడా చేసేనన్నాడు.' అన్నాను నా అక్కసు అంతా సుబ్బయ్యమీద కక్కుతూ.

'జడ్జిగారంటే అయనేనా! మొన్న భరత నాట్యాని కెళ్ళినప్పుడు మన ముందు వరసలో కూర్చున్నాడు!' అడిగింది మా ఆవిడ.

అప్పటికి కాని నాకు జ్ఞానోదయం అవలేదు. అసలు ఆ జడ్జీగారిది శుద్ధ బట్టతల. మధ్యన నున్నగా కడిగి బోర్లించిన యిత్తడి బూర్లెమూకుడులా వుండి చుట్టూ మాత్రం కంచెలాగ నూరో నూట

పాతికో వెంట్రుక లుంటాయి. సుబ్బయ్య ననిమాత్రం లాభమే వుంది!
'పే కమిటీ' చెయ్యగా మిగిలింది వీడు చేశాడు.

ఇంక ఆరోజుని పేకాట కెళ్ళదలచుకోలేదు. భోంచేసి మధ్యాహ్నం మంచంమీద పడుకుని ఆనాటి నా తలరాతను గురించి ఆలోచిస్తున్నాను. ఇంతట్లోనే మా ఆవిడ తమలపాకులు తీసుకుని 'ఏమిటి వ్వాళ క్లబ్బుకు బయలుదేరరా!' అంటూ మంచం సమీపించింది. అసలు ఈ సినీమా లొచ్చేక వంటరిగా భార్యల కళ్ళముందర పడటమంటేనే భర్తలకి భయంగా వుంటుంది. నూటికి తొంభయిమంది భార్యలు, యింట్లో ముఖ్యంగా బెడ్‌రూంలో, సినీమా డైలాగులే మాట్లాడతారు. ఇంతకీ మా ఆవిడ హంసగమనంతో మంచంచేరి పక్కనే కూర్చుని, సుబ్బయ్య ధర్మమా అని నా ముఖారవిందం మీద నాట్యంచేసే ముంగురులేమీ లేని సందర్భంలో నా చొక్కా కాలరు సర్దేటప్పటికి జరగబోయే మరో దుస్సంఘటన కిది నాంది అని అప్పుడే అనుకున్నాను.

'ఏమండీ! మీరు రేపు ... ...' అందుకుంది మా ఆవిడ.

'రేపు చాలా పనులున్నాయి'

'రేపొద్దున్నోసారి ...'

రేపొద్దున్నసలు వీలుపడదు.'

'ఓసారి బజారుకెళ్ళి ... ...'

'బజారుకా!'

'మా అక్కయ్యకో చీరా జాకెట్టుగుడ్డా తీసుకురారూ!'

'చూద్దాం.'

'చూద్దామంటే కాదు. పట్టుచీర కొంటే బాగుంటుంది. మరి మీ యిష్టం. మన చంటాడు పుట్టేక ఇదే రావడం. బారసాలకి రాలే

దని ఎంత యిదై పోయిందో! ప్రతీ వుత్తరంలోనూ వాణ్ణి గురించి అడగటమే!

'ఇంకనేం! మన చంటాణ్ణి చూడగానే ఎలాగా మురిసి పోతుంది. మరింక డబ్బు తగలేసి ఈ చీరా గొడవా ఎందుకు చెప్పు! కావలిస్తే మన చంటణ్ణే యిచ్చెయ్యి.'

'చాల్లెండి! రోజూ పేకాట్లో డబ్బు పోతే లేదుకాని, మా అక్కయ్యకో చీర కొనమంటే ఎక్కడ లేని పొదుపూ వస్తుంది.'

'రోజూ పేకాటలో డబ్బు తగలేస్తున్నానని ఎవరు చెప్పేరు నా రాణీ!'

'క్లబ్బునుంచి రాగానే మీ మొహమే చెబుతుంది.'

'ఎలాగైనా సూక్ష్మగ్రాహివి. నిజం యిట్టే కనిపెట్టేస్తావు. ఇంతకీ రోజూ నేను ఒళ్ళూపై తెలీకుండా డబ్బు తగలేస్తుంటే, యింట్లో నువ్వేనా కాస్త పొదుపుగా వుండకపోతే మన సంసారం గతేంకానూ!'

'అవున్లెండి! మా అక్కయ్యకో చీర కొనమంటే యిన్ని పాఠాలు చదువుతారు. అదే మీ చెల్లెలొస్తే......'

'ఒస్తే! ఆపేశావేం?'

'మధ్య నాకెందుకు లెండి!'

'ఆ అనేదేదో పూర్తిగా అను. లేకపోతే నాలిక పీకెయ్యగలను.'

'నాలికా పీకేస్తారు, పీక నులిమేస్తారు. బాగుంది వరస.'

'చీరా లేదు గాడిదగుడ్డూలేదు. అసలు మీ బావగాడంటే నాకు ఒళ్ళు మంట. రాచ్చిప్పలా మొహం వాడూను. ఇదిగో యీ

సారి మళ్ళీ నీతులుచెబుతూ వుపన్యాసా లిచ్చాడా వాడి పళ్ళూడ తంతాను."

"మీరంతపనీ చెయ్యగల సమర్థులే. మీ కో నమస్కారం పెడ తాను. మీరేమీ కొనాపద్దు పెట్టాపద్దుకాని... ...మీరు నిజంగా అంత రాద్ధాంతం చెయ్యదల్చుకుంటే రావద్దనో టెలిగ్రాం యివ్వండి. లేదా మీరు క్యాంప్ కేనా వెళ్ళండి. వాళ్ళ కేదో సమాధానం చెప్పగుంటా."

"ఇల్లు విడిచిపెట్టి పారిపోవల్సిన ఖర్మం నాకేం బట్టింది. తన్నులు తప్పే యోగముంటే వాడే రావడం మానుకుంటాడు." అంటూ చొక్కా పంట్లాముల్లోకి దూరేను క్లబ్బుకెళ్ళే ప్రయత్నంలో.

రాత్రి భోజనం చాలా ముభావంగా ముగిసింది. ఏమైనాసరే నేను మాత్రం మెత్తబడదలుచుకో లేదు. మా అవిడా బింకంగానే వుంది. రాజీ ప్రయత్నం ఎక్కడా కనబడలేదు ఇదీ ఓ అందుకు మంచిదే ననుకున్నాను. తమలపాకులు నములుతూ పందిరి పట్టెమంచం మీద నడుంవాల్చి పేపరు చదువుకుంటుంటే ప్రవేశించింది మా అవిడ. పేపరు చాటునుంచి గమనిస్తున్నాను. "కొందరి సంసారాలు చూస్తే ముచ్చటేస్తుంది. పొద్దున్నుంచి రాత్రివరకూ రెక్కలు ముక్కలు చేసు కుంటూ చాకిరీ చెయ్యడమేకాని భగవంతుడు నా మొహాన్నో సరదా సంతోషం రాసిపెట్టలేదు" అంటూ ధబ్బుని మరచెంబు బల్లమీద పెట్టింది. నేను మాట్లాడలేదు. పౌడరు మొహానికి పులుముకుంది. తల్లో మల్లెపూల దండ తురుముకుంటూ "నెల్లాళ్ళయి తెగిపోయింది నెక్లెస్. కాస్త అతికించి తెచ్చిపెట్టే దిక్కు లేదు కదా" అని కంప్లెయింటు. నేను మాత్రం మళ్ళీ డిటో. నా నోరు పెగలక పోయేటప్పటికి, మూలనున్న మడత మంచం దుమ్ము దులిపి తెచ్చుకుని చంటాడి వుయ్యాలా పక్కనే వేసుకు పడుకుంది, అదేదో నాకో పెద్ద శిక్షలాగ.

ఈ ఎనభై నాలుగు లక్షల జీవరాసులలోకి ఉత్కృష్టమైన దంటారు మానవజన్మ. అందులో పురుష జన్మ మరీ గర్వించ తగ్గది. ఆ కాస్త గర్వం మొగాడికి దక్కకుండా భగవంతుడు ఈ స్త్రీని సృష్టి చేడనుకుంటా. లేకపోతే మొగాడి బుద్ధి ఇంత వెర్రితల లెయ్యేదు. అందం చందం అంటూ ఆడదాన్ని అందలం ఎక్కించి పాదాక్రాంతు డయ్యేడు మొగాడు. అబల గిబల అంటూ తబలా వాయిస్తూ నెత్తి కెక్కించుకున్నాడు. దీనికి సాయం మొగాణ్ణి అధః పాతాళానికి తొక్కేస్తూ ఈ పెళ్ళనే సాంఘిక దురాచారం ఒకటీ! నిశితంగా పరిశీలిస్తే సృష్టిలో పురుషుల్లో వున్న అందం స్త్రీలో ఎక్కడుంది! మనుషుల్లో మాటేమిటి, జంతువుల్లోనూ, పక్షుల్లోనూ కూడా అంతే. గంభీరమైన మొగసింహాన్ని చూసినా, ఠీవిగా రంకెలు వేసే ఆంబోతును చూసినా, పౌరుషంతో ముందుకు గెంతే కోడిపుంజును చూసినా, పురివిప్పి నాట్యంచేసే మొగ నెమిలిని చూసినా అందం యొక్క నిర్వచనం కళ్ళకి కనబడుతుంది. ఆడదాని అందమల్లా మొగాడు తన కామచక్షువుల్తో చూసి వూహించుకున్నదే. అష్టవంకర్లగానూ వుంటే ఆడదాని శరీరాన్ని యింపులూ, ఒంపులూ, సొంపులూ అంటూ సమర్థించేడు. రంగురంగుల గుడ్డలు గరగర్లాంటి ఆడదానికి చుట్టబెట్టేడు. పరిమళాలు వెదజల్లే అందమైన పువ్వులు తీసుగొచ్చి మెతక్కంపుకొట్టే ఆడదాని జుట్టు శిఖలో దోపేడు. నఖశిఖపర్యంతం, ఒళ్ళు చిల్లులుకూడా పొడిచి ఆభరణాలు పేరుచెప్పి బంగారం తొడిగేడు. గోళ్ళకి, కళ్ళకి, పెదిమలకీ, బుగ్గలకీ రంగు పులిమేడు. ఇదిగాక ఆడదాని అందాన్ని వర్ణించని కవిగాని, దాన్ని గానంచెయ్యని సంగీత విద్వాంసుడుగాని, చిత్రించని చిత్రకారుడుకాని, చెక్కని శిల్పికాని మచ్చుకు కనబడడు. ఎక్కడేనా ఆడదాని బొమ్మ కనబడితే భద్రంగా తీసుకొచ్చి గోడకి తగిలించి ఆనందించని మొగాడు అరుదు. పైగా బీడీకట్టనుంచి మోటారుకారు ఎడ్వర్‌టైజ్‌మెంట్ వరకూ ఆడదాని బొమ్మే! ఆడది అందమైనదని మొగాడనుకోవడం కంటే విషాదకరమైన విషయ మేమిటంటే అది నిజమేనని ఆడది

నమ్మకుం. చూస్తూండగా అరడబ్బాడు పౌడరు మొహానికి పులుముకుంది బారెడు మల్లెపువ్వులదండ శిఖలో తురుముకుంది. ఇంకా నెక్లెస్ రిపేరు చేయించలేదని నేరం! వాళ్ళక్కకి చీర కొనాలిట! అందు లోనూ పట్టుచీర! డేం నాన్ సెన్స్!

* * *

'గుడ్ మార్నింగ్' అన్న మూర్తి గొంతువిని మర్నాడు పొద్దున్నే లేచేను.

'థేంక్స్' అన్నాను.

'ఎందుకూ!'

'పొద్దున్నే నీ మొహం చూపించినందుకు.'

'అది సరేకాని! ఈ గుండేమిట్రా! నువ్వుకాని ఈ డలైలామా శిష్యులో చేరిపోటం లేదు కదా! ఇందాకా పరాగ్గా నిన్నూ నీ ముసుగూ చూసి మీ మేనత్తేమో ననుకున్నాను.'

'ఇదంతా మా ఫ్యాన్ చేసిన పనిరా.'

'ఫ్యాన్ చేత పని చేయించుకోడ మేమిట్రా. రూపాయో అర్ధో పడేసి మంగలిచేత చేయించుకోవాలి కాని!'

ఇంతలోకే మా ఆవిడ రెండుకప్పులు కాఫీతో ప్రత్యక్ష మయింది. 'ఏమండమ్మోయ్! ఇవ్వాళ మీ రిద్దరూ మా యింటికి భోజ నానికి వస్తానని మాట యిచ్చేరు. జ్ఞాపకం చెయ్యడానికి స్వయంగా వచ్చాను.' అన్నాడు మూర్తి మామూలు ధోరణిలో.

'క్షమించండి, అన్నగారూ! మీ యింటికి భోజనానికి రావడం మాకేం కొత్త కాదు. మా అక్కయ్యా బావా పొద్దున్న బండిలో వొస్తున్నారు...'

'మరీ మంచిది. అందరూ కలిసిరండి.'

'అది మీరు వేరే చెప్పాలా! మీ యింట్లో మాకేం మొహ మాటమా! రైలు రావడం లేటయితే వాళ్ళిక్కడ కొచ్చి సామాన్లు సర్దుకుని స్నానాలుచేసి మళ్ళీ బయలు దేరడమంటే చాలా ఆలస్యమై పోతుంది. అంచేత ఏ మాత్రం వీలున్నా వొస్తాం. రాకపోతే మాత్రం ఏమీ అనుకోకండి. వొదినగారితో కూడా చెప్పండి మరోలా అనుకో వద్దని' అంది దడదడ వర్షొ జల్లులాగ.

'అలాగంటే ఎలాగమ్మా...'

పై వాళ్ళకి చెప్పినట్టుగా పదిసార్లు మీకు మాకు చెప్పాలా! మీకు ఉత్సాహ భంగం కాకుండా ఆయన ఎలాగా వస్తారు' అంది ఖాళీగ్లాసుల్తో నిష్క్రమిస్తూ.

'ఏమిట్రా! వాతావరణం ఇంతపొడిగా వుంది!' అన్నాడు మూర్తి మా ఆవిడ ధోరణికి నానోరు పెగలక పోవడానికి వెనక ఏదో ప్రళయొ వుందని గ్రహిస్తూ.

మా ఆవిడకి వినబడకుండా జరిగిందంతా పూసగుచ్చినట్టు చాలా భాగం అభినయం ద్వారా మూర్తికి చెప్పేను.

'ఓరి దౌర్భాగ్యుడా! కట్టుకున్న భార్య నలా అవమానిస్తావా! ఇంట్లో శుచిగా రుచిగా వంటచేస్తూ, ఇల్లూ పిల్లల్ని సంరక్షిస్తూ, తిండీ బట్టల్తో తృప్తిపడి జీతం అడక్కుండా బానిసల్లా సేవచేసె భార్యల్ని క్షోభపెట్టి ఈ ప్రజాస్వామ్య యుగంలో బతగ్గలమా! వాళ్ళు సమ్మె చేస్తే బతుకులేంగాను!'

'అదే పొరపాటైపోయిందిరా.'

'సిగరెట్లూ, సినిమాలూ, పేకాట మానెయ్యమని అమూల్య మైన సలహాయిచ్చే తోడల్లుడే నాకుంటే బ్రహ్మరథం పట్టేవాణ్ణి మా

తోడల్లుడు కొవ్వొత్తి రెండువైపులా వెలిగించాలనేరకం. మీ తోడల్లు డిలాంటి మహానుభావుణ్ణి పట్టుకుని వెధవా బోడీ అని పైగా తంతా నని బెదిరిస్తావా!'

'ఒరేయి! ఇప్పటికే పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న నా హృదయంమీద నీ మాటల్తో పెట్రోలు పోస్తున్నావ' అన్నాను.

ఇంతలోకే టెలిగ్రాఫ్ ప్యూన్ ఒచ్చి టెలిగ్రాం యిచ్చేడు. మా తోడల్లుకు కారణాంతరాలవల్ల యిక్కడ దిగడానికి వీల్లేక నిన్న రాత్రి బండికే వెళ్ళిపోయినట్టు వార్త. చదివి మూర్తి కిచ్చేను.

'నిష్కారణంగా ఎంత రభస చేశావు! మీ ఆవిడ ఇది చూసి ఎంత బాధ పడుతుందో ఆలోచించేవా! ఇక్కడ దిగుతే నువ్వేదో అవమానిద్దా మనుకున్నావు కాని, మీ తోడల్లుడు యిక్కడికి రాకుం డానే నీ తెగులు కుదిర్చేడు. అనుభవించు!'

'నన్నింక పీక్కు తినకురా జలగా! తప్పేనని బుర్ర బద్దలుకొట్టు కుంటున్నాను కదా! వీలయితే సలహా చెప్పు' అని బతిమాలాను.

'సరే! అయితే ఓ పని చెయ్యి. ఈ టెలిగ్రాం వొచ్చినట్టు మీ ఆవిడకు చెప్పకు. పది గంటలకి మా స్టేట్ బ్యాంక్ ప్యూన్ చేతి కిచ్చి పంపిస్తాను. వాడికీ కాకీ యూనిఫారం వుంటుంది కనక ఒకవేళ మీ ఆవిడ చూసినా టెలిగ్రాం ఆతృతలో వాణ్ణి గమనించదు. అప్పుడే వొచ్చినట్టు అది చింపి చదువు. మీ ఆవిడ నెక్లెస్ యిప్పుడు నా చేతి కియ్యి. నేనో గంటలో రిపేరు చేయించి పంపిస్తాను. తొమ్మిది గంటలకి మోడర్న్ సిల్క్ పేలస్ వాణ్ణి పట్టుచీరలు తీసుకుని మీ యింటికి రమ్మని ఫోన్ చేస్తాను. రాగానే వాళ్ళక్కయ్యకో పట్టుచీర సెలెక్ట్ చెయ్యి. తర్వాత ఆవిడెలాగారాదు కనక దాన్ని మీ ఆవిడే కట్టుకుంటుంది.'

"మళ్ళీ యిప్పుడు చీరెందుకురా!"

"ఇంక వెర్రి వెర్రి వేషాలెయ్యకు. నే చెప్పినట్టు చెయ్యకపోతే నీ పాపానికి నిష్కృతి లేదు."

"నా నేరానికో పట్టుచీర జుర్మానా అంటావు. సరే ఏంజేస్తాం. కాని చూస్తూ చూస్తూ మళ్ళీ మా ఆవిణ్ణి మోసం చెయ్యడానికి నా మనస్సంగీకరించటం లేదురా."

"మహబాగా అంగీకరిస్తుంది. నే చెప్పేనని చెప్పు. ఈలోగా వీలు చూసుకుని మీ ఆవిడతో రాజీపడు."

"ఎలాగరా! మా యిద్దరిమధ్యా నిన్నట్నుంచీ మాటల్లేవు."

"అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ. పాహిమాం, పాహిమాం అంటూ మీ ఆవిడ కాళ్ళు పట్టుకో. వెంటనే ఆవిడ కరుణా కిరణాలు నీమీద ప్రసరిస్తుంది."

"భార్య కాళ్ళు పట్టుకోడమా!"

"శ్రీకృష్ణభగవానుడే చేశాడు. వాడి బాబు ఏకంగా గాడిద కాళ్ళే పట్టుకున్నాడు."

"అన్యధా శరణం నాస్తి... ...తర్వాత."

"త్వమేవ శరణం మమ. తరవాత టూ టైమ్స్ పాహిమాం."

"నోరు తిరగటంలేదురా."

"నీవే తల్లివి తండ్రివి—పద్యం ఒచ్చుకదా! పోనీ అదే తగులడు. అంత ఘాటుగా లేకపోయినా పని జరుగుతుంది. అదిగో లోపల మీ చంటాడేడుస్తున్నాడు. వెళ్ళి ఉయ్యాలదగ్గిర కాయి."

మూర్తిగాడి సలహా అక్షరాలా పాటించేను. మా ఆవిడా, మా చెంటాడూ, పాలబుట్టా, థెర్మోస్ ఫ్లాస్క్, రబ్బరుగుడ్డతో సహా రిక్షాలో మూర్తియింటి కారోజు మధ్యాన్నం భోజనాని కెడుతూ, మా ఆవిడ కట్టుకున్న కొత్త పట్టుచీర ధగధగ మెరిసిపోవడం చూస్తూంటే నా కళ్ళు చీకట్లు కమ్మేయి.